## కాలనీ సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న శ్రీసాయినగర్ కాలనీవాసులు

**నేరేడ్‌మెట్, నవంబర్ 13:** వినాయకనగర్ డివిజన్ శ్రీసాయి నగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం కాలనీ అధ్యక్షుడు రంపె చంద్రమౌలి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డిని తన కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా 3 ఫేస్ విద్యుత్ సరఫరా, కరెంట్ స్తంభాలు మార్పు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుచేయాలని వినతి పత్రంలో పేర్కొనారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే వివిధ శాఖల అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలను అధికారులను ఆదేశించారు.

## సమస్యలు పరిష్కరించేందుకు కృషి

సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి తదితరులు

**నేరేడ్‌మెట్,నవంబర్ 13:** వినాయకనగర్ డివిజన్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం నవభారత్ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానికులతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్ సాగర్, కాలనీ అధ్యక్షుడు విజయ్, బీజేపీ నాయకులు ఓం ప్రకాష్, సురేష్, శ్రీకాంత్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కాళోజీకి ఘన నివాళి

**కాప్రా, నవంబర్ 13:** ప్రముఖ కవి దివంగత కాళోజీ నారాయణరావు వర్ధంతిని బుధవారం ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్‌లో స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పలువురు ప్రముఖులు పూలమాల వేసి నివాళులర్పించారు.

## పార్క్ చేసిన బైక్ చోరీ

**కీసర, నవంబర్ 13:** కీసరలో బైక్ చోరీ జరిగింది. కీసరలోని హనుమాన్ ట్రేడర్స్ షాప్ ఎదుట పార్క్ చేసిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు ఆంజనేయులు బుధవారం కీసర పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# అపరిశుభ్రతకు నిలయం ఎన్ఎఫ్‌సీనగర్ కాలనీ

- పట్టించుకోని అధికారులు, పాలకవర్గం
- నెల తరబడి పేరుకుపోయిన చెత్త
- రోగాల బారిన పడుతున్న స్థానిక ప్రజలు

ఎన్ఎఫ్‌సీనగర్ బీ-1 కాలనీలో ఇండ్ల ఎదుట పేరుకుపోయిన చెత్తాచెదారం

**ఘట్‌కేసర్ రూరల్,నవంబర్ 13:** ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలో అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా నెలల తరబడి చెత్తాచెదారం పేరుకుపోయి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పారిశుధ్య కార్మికులు చెత్తను ఊడ్చి ఇండ్ల ముందే వేసి వెళ్లిపోతున్నారు. నెలల తరబడి తిరిగి చూడకపోవటంతో వీధులన్నీ అపరిశుభ్రంగా మారుతున్నాయి.ఘట్‌కేసర్ మున్సిపాలిటీ 1వ వార్డులో అపరిశుభ్రత కారణంగా ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

నెల రోజులుగా చెత్తకుప్పలు ఎక్కడికక్కడే నేటికి దర్శనం ఇస్తున్నాయి. ఈ విషయాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా ఎన్ఎఫ్‌సీనగర్ కాలనీ మారటం వల్ల పరిశుభ్రత, పచ్చదనం పెంపొందుతుందని సంబరపడ్డ ప్రజలకు నిత్యం సమస్యలే ఎదురవుతుండటం పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి పేరుకుపోయిన చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

## ఘనంగా జవహర్‌నగర్ మాజీ మేయర్ జన్మదినం

శ్రీశైలం ఆలయంలో భక్తులకు అన్నదానం చేస్తున్న జవహర్‌నగర్ మాజీ మేయర్ మేకల కావ్య

**జవహర్‌నగర్,నవంబర్ 13:** జవహర్‌నగర్ మాజీ మేయర్ మేకల కావ్య పుట్టిన రోజును పురస్కరించుకొని శ్రీశైలం మల్లన్న ఆలయంలో భక్తులకు బుధవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. అనంతరం శ్రీశైలం మల్లన్నను దర్శించుకొని ఆమె ప్రత్యేక పూజలు చేశారు. అభిమానులు, కార్యకర్తలు జవహర్‌నగర్, రాంపల్లిలోని ఆదర్శ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. పాలకవర్గంసభ్యులు, కార్యకర్తలు మేకల కావ్యకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు మేకల అయ్యప్ప, యువజన విభాగం అధ్యక్షుడు భార్గవ్ రామ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, సోషల్ మీడియా కన్వీనర్ అహ్మద్ పాషా, నర్సింహయాదవ్, ప్రసాద్‌గౌడ్, నర్సింహ, బీఆర్ఎస్ మహిళా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి

జడ్పీకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ బన్నాల

**ఉప్పల్, నవంబర్ 13:** చిలుకానగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్ కోరారు. ఈ మేరకు ఎల్బీనగర్ జోన్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని బీరప్పగడ్డ, న్యూరామ్‌నగర్, కుమ్మరికుంట, బొడ్రాయి ప్రాంతంలో వరదనీటి సమస్యలు, సీసీ రోడ్డు సమస్యలు ఉన్నాయని తెలిపారు. మల్లికార్జున్‌నగర్‌లో అవుట్‌లెట్‌కు నూతన పైపులైన్లు వేయాలని, కాలనీల మధ్య పెన్సింగ్ సమస్యలు ఉన్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## గుర్రపు డెక్క వ్యర్థాలను వెంటనే తొలగించాలి

అధికారులకు సూచనలు చేస్తున్న కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్

**ఉప్పల్, నవంబర్ 13:** చెరువులో తొలగించిన గుర్రపు డెక్క వ్యర్థాలను వెంటనే తొలగించాలని నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ ఆదేశించారు. నాచారం డివిజన్‌లోని హెచ్ఎంటీనగర్ పెద్ద చెరువు పరిసర ప్రాంతాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చెరువులను సుందరీకరించి, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరసింహ, గ్రేటర్ బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, నేతలు ముత్యంరెడ్డి, శేఖర్ యాదవ్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

**ఉప్పల్, నవంబర్ 13:** రామంతాపూర్‌లోని రామ్‌శంకర్‌నగర్‌లో వరదనీటి కాలువ నిర్మాణ పనులను బుధవారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు పరిశీలించారు. ఈసందర్భంగా అధికారులతో కలిసి పనులను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల్లో జాప్యం లేకుండా, నాణ్యతగా పనులు పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్వేత, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

వరదనీటి కాలువ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి వెంకట్రావు

ఘట్‌కేసర్‌లో ఐమాక్స్ లైట్లను మరమ్మతులు చేయిస్తున్న చైర్‌పర్సన్ పావనీజంగయ్య యాదవ్

## అన్ని ప్రధాన వీధుల్లో ఐమాస్ట్ లైట్ల ఏర్పాటు

**ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 13:** ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రధాన వీధుల్లో ఐమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో వెలుగకుండా ఉన్న ఐమాస్ట్ లైట్లను బుధవారం మరమ్మతులు చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎస్‌రావునగర్ డివిజన్ శ్రీలక్ష్మీరెసిడెన్సీలో సర్వే ప్రక్రియను పరిశీలించి ఎన్యూమరేటర్లతో మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్, నోడల్ అధికారి ఎస్.సరోజ, పాల్గొన్న డీసీ జగన్, ఇతర అధికారులు

## సర్వే పరిశీలన

**కాప్రా, నవంబర్ 13:** రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ,కుల సర్వేను జీహెచ్ఎంసీ ఉన్నతస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. ఇందులో భాగంగా జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్, నోడల్ అధికారి ఎస్.సరోజ బుధవారం కాప్రా సర్కిల్ ఏఎస్‌రావునగర్ డివిజన్ అనుపురం పరిధిలోని శ్రీ లక్ష్మీరెసిడెన్సీలో జరుగుతున్న సమగ్ర సర్వేను పరిశీలించారు. సర్వే తీరును ఎన్యూమరేటర్లను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ డీసీ జగన్, పీఓ దామోదర్, ఏఎం సీ ఆనంద్, వార్డు అధికారి అశోక్ పాల్గొన్నారు.

## భూసార పరీక్షలతో లాభసాటి వ్యవసాయం



రైతులకు భూసార పరీక్షల సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ నర్సింహులుయాదవ్.

**శామీర్‌పేట, నవంబర్ 13:** రైతులు సాంకేతిక, శాస్త్రీయ పద్ధతిని ఉపయోగించడం, భూసార పరీక్షలతో లాభసాటి వ్యవసాయం చేయవచ్చునని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులుయాదవ్ అన్నారు. ఇక్రిసాట్ ఆధ్వర్యంలో కేశవరం, జగ్గంగూడ, నాగిశెట్టిపల్లి గ్రామాల్లో భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు బుధవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంలో భూమిలో ఉన్న పోషకాలు తెలుసుకుని ఏఏ ఎరువులు వాడుకోవాలి, ఏఏ పంటలు వేసుకోవాలని విషయాలు తెలుసుకోవచ్చునన్నారు. రైతులు సాంకేతిక, శాస్త్రీయ పద్ధతులను ఉపయోగిచుకుని లాభసాటి వ్యవసాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇక్రిసాట్ అధికారులు, మాజీ ఎంపీటీసీ హనుమంత్‌రెడ్డి, రైతులు కొమరయ్య, మల్లేశ్, కృష్ణ, బలరామ్‌చారి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, భూమేషన్, మైసమయ్య, శ్రీశైలం, సుధాకర్, రామస్వామి, రైతులు పాల్గొన్నారు.

## నూతన నియామకం

యాదగిరిని అభినందిస్తున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

**శామీర్‌పేట, నవంబర్ 13:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం శామీర్‌పేట మండలం అధ్యక్షుడిగా తుర్కపల్లి గ్రామానికి చెందిన రుద్రబోయిన యాదగిరిముదిరాజ్‌ను నియమించారు. బుధవారం నియామక పత్రాన్ని మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు జిట్ట శ్రీనివాస్‌రెడ్డి చేతులమీదుగా అందజేశారు. తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా నియమించినకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఉద్యమకారుల గొంతుకగా పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అనంత లక్ష్మి, పరశురాము, ప్రసాద్, మూడుచింతలపల్లి మండల అధ్యక్షుడు మంద స్వామి ముదిరాజ్ పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ఉప్పల్, నవంబర్ 13:** మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. ఉప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలోని హెచ్ఎండీఏ ఫీడర్ పరిధిలోని ఉప్పల్ భగాయత్, కాలభైరవ టెంపుల్, టీఎన్ఆర్ లేన్, నారాయణ స్కూల్ లేన్, హెచ్ఎండీఏ ప్రాంతాలోల ఉదయం 11 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు విద్యుత్ ఉండదని ఉప్పల్ భగాయత్ ఏఈ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.అదేవిధంగా రామంతాపూర్ పాలిటెక్నిక్ సబ్‌స్టేషన్ పరిధిలోని విశాల్ బిల్డింగ్ ఏరియా, అరోరా కళాశాల, గుప్తాగార్డెన్, గణేశ్‌నగర్, దూరదర్శన్ క్వాటర్స్, సాయిగార్డెన్ ప్రాంతా ల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు విద్యుత్ ఉండదని రామంతాపూర్ ఏఈ కె.లావణ్య తెలిపారు.హబ్సిగూడ సెక్షన్ పరిధిలోని జేఎస్ ఎన్ కాలనీ, జీజీకాలనీ, వివేకానందకాలనీ, శోభననగర్, విజ్ఞనపురి ప్రాంతాల్లో ఉదయం 11నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ ఉండదని హబ్సిగూడ ఏఈ వి.గణేశ్ తెలిపారు.

**నారపల్లిలో..**

**ఘట్‌కేసర్:** పోచారం మున్సిపాలిటీ నారపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం మధ్యాహ్నం 11 నుంచి 12 గంటలవరకుఅన్నానగర్,డాక్టర్స్ కాలనీ,జోడిమెట్ల ఎక్స్‌రోడ్స్, అరుంధతీ కాలనీ,కాకతీయనగర్, స్వర్ణగిరి కాలనీ,వైష్ణవి, చౌదరిగూడ,12 నుంచి1గంట వరకు పోచారం,విజయసాయి ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ వి.ప్రదీప్ కుమార్ తెలిపారు.

**మల్లాపూర్‌లో..**

**మల్లాపూర్:** మల్లాపూర్‌లో 11 కేవీ నోమా ఫీడర్ పరిధిలోని చాణక్యపురి కాలని, సూర్యనగర్, గోకుల్‌నగర్, మోడీ వెంచర్స్, చండీయానగర్, బాబానగర్‌లో ఉదయం 11 నుంచి సాయంత్రం 4:30 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ నాగరాజ్ తెలిపారు.

**నాగారంలో..**

**మేడ్చల్ కలెక్టరేట్:** కేవీ చక్రీపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఉషోదయ కాలనీ, రేణుక ఎల్లమ్మ కాలనీ, ఎస్.వీ నగర్, పీఎంఆర్ ఎన్‌క్లేవ్, వెంకటాద్రి కాలనీ, మామిళ్ల నారా యణ కాలనీ, ఎస్‌వీఎన్ గార్డెన్, బ్రహ్మయ్య కాలనీ, ఈశ్వర పురి కాలనీ, సాయి నివాస్, జీపీకాలనీ, సాయి శుక్ల కాలనీల్లో ఉదయం 11నుంచి సాయంత్రం 4.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని సెక్షన్ విద్యుత్ ఏఈ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

**ఘట్‌కేసర్‌లో ..**

**ఘట్‌కేసర్ రూరల్:** ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్‌నగర్, ఎదులాబాద్ రోడ్డు, పాత ఘట్‌కేసర్, బుగ్గ బావి కాలనీ, బ్రూక్‌బాండ్ కాలనీ, లింగాలకుంటలో డీటీఆర్ మెయింటనెన్స్‌తో పాటు చెట్లను తొలగించనున్నందున గురువారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలివేయనున్నట్లు ఏఈ బీ బలరాం చెప్పారు.

**మల్కాజిగిరి సర్కిల్‌లో**

**మల్కాజిగిరి:** మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని 11ఐఎన్ నగర్‌ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 11.00నుంచి సాయంత్రం 4.30వరకు ఐఎన్ నగర్, అన్నపూర్ణకాలనీ కాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదు.

**శామీర్‌పేటలో..**

**శామీర్‌పేట:** శామీర్‌పేట సబ్ స్టేషన్ 33/11 బొమ్మరాశిపేట సబ్ స్టేషన్ పరిధిలోని బొమ్మరాశిపేట, బాబాగూ, జగ్గంగూడ గ్రామాల్లో గురువారం ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ రాఘవేందర్‌రావు తెలిపారు.

## నేడు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**కాప్రా, నవంబర్ 13:** ఏఎస్‌రావునగర్ డివిజన్‌లోని ఉప్పల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఉదయం 10.30 గంటలకు సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరైన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ ఉంటుందని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. లబ్ధిదారులు సకాలంలో క్యాంపు కార్యాలయానికి విచ్చేసి చెక్కులను తీసుకోవాలని వారు సూచించారు.

## నేటి నుంచి దర్గా ఉర్సు ఉత్సవాలు

**ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 13:** కోరిన కోర్కెలు తీర్చే దర్గాగా పేరొందిన ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని అవుషాపూర్ షానూర్ బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు ఈనెల 14 నుంచి 17వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మీర్ షాబుద్దీన్ అలీఖాన్ తెలిపారు. ఈ ఉత్సవాల్లో ఘట్‌కేసర్ మున్సిపాలిటీతో పాటు జంట నగరాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తారని చెప్పారు.

## చదరం హంసినికి బంగారు పతకం

చదరం హంసికి బహుమతి అందిస్తున్న అసోసియేషన్ అధ్యక్షులు కార్యదర్శులు

**నేరేడ్‌మెట్, నవంబర్ 13:** రాజస్థాన్‌లోని జైపూర్ వేదికగా యోనెక్స్ సన్‌రైస్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీలో చదరం హంసిని చాంపియన్‌గా నిలిచింది. గత నెల 4న ప్రారంభైన టోర్నీ బుధవారం ఫైనల్స్ జరిగాయి. అందులో భాగంగా అండర్ 15 క్యాటగిరిలో చదరం హంసినితో కేరళ రాష్ట్రానికి చెందిన హితామరి జోష్ పోటీ పడగా 19-21, 21-8, 21-14 స్కోర్‌తో ప్రత్యర్థిని చిత్తు చేసి గోల్డ్ మెడల్ కైవసం చేసుకుంది. ముగింపు వేడుకల్లో రాజస్థాన్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు చదరం హంసినికి బహుమతిని అందజేశారు.

## వీధి కుక్కలను చంపిన వ్యక్తులపై కేసు

**జవహర్‌నగర్, నవంబర్ 13:** జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధి కార్మిక నగర్‌లో వీధి కుక్కలను బంధించి కర్రలతో కొట్టి చంపడం చర్చనీయాంశంగా మారింది. ఎస్‌హెచ్‌వో సైదయ్య కథనం ప్రకారం... కార్మికనగర్‌కు చెందిన ఎన్.కృష్ణ, ఉపేందర్, ఈ. కృష్ణ, వెంకటేష్ అనే వ్యక్తులు బుధవారం వీధి కుక్కలను బంధించి కర్రలతో కొట్టి చంపారు. ఈ సన్నివేశం వీడియోలో నిక్షిప్తమైంది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. దుండగుల దాడిలో రెండు కుక్కలు చనిపోగా, ఒక కుక్కకు గాయమైంది. చనిపోయిన కుక్కలను పోస్టుమార్టం నిమిత్తం హాస్పిటల్‌కు తరలించగా, మరొకటి చికిత్స పొందుతున్నది. ఈ ఘటనపై సయ్యద్ సలీం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# సర్వేకు వచ్చే ముందు కుటుంబాలకు సమాచారం ఇవ్వాలి

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్**

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్

**మేడ్చల్ కలెక్టరేట్,నవంబర్13:** సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో అందుబాటులో లేని కుటుంబ సభ్యులకు ముందుగానే సర్వే సమయాన్ని అవసరమైన డాక్యుమెంట్లను అందుబాటుటో పెట్టుకునేలా ఎన్యూమరేటర్ల ద్వారా ఇంటింటికి సమాచారాన్ని అందించాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి దివ్యదేవరాజన్ సర్వే నోడల్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో కుటుంబ సర్వే, ధాన్యం సేకరణ అంశాలపై జిల్లా కలెక్టర్ గౌతమ్‌తో కలిసి దివ్యదేవరాజన్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక ప్రణాళిక ప్రకారం షెడ్యూల్ చేసుకొని సర్వే నిర్వహించాలని, జిల్లాలో వలసదారులు ఎక్కువగా ఉన్నందున్న వారు స్వచ్ఛందంగా కోరిన చోట నమోదు చేయాలన్నారు. సర్వే నిర్వహణలో కలిగే సమస్యలను నోడల్ అధికారుల సహకారంతో పరిష్కరించుకోవాలని సూచించారు.కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్-3 పరీక్షలు ఉన్నందున సర్వే పూర్తి కావడానికి ఇంకా కొంత సమయం పడుతుందని వివరించారు. అనంతరం కలెక్టరేట్‌లోని ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఆమె పరిశీలించి ఆహార పదార్థాల రుచిని చూశారు.

ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, ఆర్‌డీఓలు సైదులు, శ్యాంప్రకాష్, డీఆర్‌డీఓ సాంబశివరావు, జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తులు అరెస్టు

**పీర్జాదిగూడ, నవంబర్ 13:** రేషన్ బియ్యం కొనుగోలు చేసి తరలిస్తున్న ముగ్గురుని ఎస్వోటీ పోలీసులు అదుపులోకి తీసుకున్న సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.... మేడిపల్లికి చెందిన దీరావత్ శ్రీను , బానోతు మంజుల,లావుడ్యా బాలమ్మలు కలిసి పేదలకు అందిస్తున్న ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని పరిసర ప్రాంతాల్లో పలువురి వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ రకు విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న మల్కాజిగిరి జోన్ ఎస్వోటీ పోలీసులు బుధవారం మేడిపల్లిలో రేషన్ బియ్యం కొనుగోలు చేసి తరలిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 4 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని మేడిపల్లి పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## నగరంలో పలు చోట్ల ఆబ్కారీ దాడులు

**సిటీబ్యూరో, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ):** నగరంలో పలు చోట్ల ఆబ్కారిశాఖ దాడులు నిర్వహించింది. ఆబ్కారీ పోలీసుల కథనం ప్రకారం...మేడ్చల్ ఎక్సైజ్ స్టేషన్ రఘునాథ్‌చెరువు ప్రాంతంలో బేగంబజార్‌కు చెందిన యోగేష్‌యాదవ్ బైక్‌పై గంజాయి రవాణా చేస్తున్నాడు. సమాచారం అందుకున్న మేడ్చల్ డీటీఎఫ్ ఎస్ఐ బాలరాజు తన బృందంతో కలిసి నిందితుడిని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 1.50కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులో గోల్కొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఆసిఫ్‌నగర్‌లో గంజాయి విక్రయిస్తున్న మహ్మద్ యూసుఫ్‌ఖాన్‌ను ఎస్‌టీఎఫ్ అధికారులు అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 1.11కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

## రేపు టీయూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

**కీసర, నవంబర్ 13:** తెలంగాణ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) రాష్ట్ర అత్యవసర సమావేశాన్ని ఈనెల 15వ తేదీన శుక్రవారం ఉప్పల్ డిపో సమీపంలోని విజయరత్న స్కూల్‌లో నిర్వహిస్తున్నామని టీయూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి జంకిటి కైలాసం ఒక ప్రకటనలో తెలిపారు.

# రోడ్డుపై గుంత పూడ్చివేత

- మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీకి చేయని మరమ్మతు
- స్పందించని అధికారులు
- నడుం కట్టిన కౌన్సిలర్

**మేడ్చల్, నవంబరు 13:** మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్ రోడ్డులో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో ఏర్పడిన గుంతతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై 'రెండేళ్ల యినా లీకేజీని సరి చేయరా' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనంపై సంబంధిత అధికారులు స్పందించ లేదు. కానీ స్థానిక కౌన్సిలర్ జంగా హరికృష్ణ యాదవ్ స్పందించి, తాత్కాలిక మరమ్మతులకు దిగారు. కౌన్సిలర్ జంగ హరికృష్ణ యాదవ్ మాట్లాడుతూ దాదాపు ఆరు నెలలుగా రోడ్డుపై ఏర్పడిన పెద్ద గుంతతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పలువురు ద్విచక్ర వాహనదారులు గుంతలో పడి తీవ్ర గాయాల పాలయ్యారు. పలుమార్లు సమస్యను పరిష్కరించాలని వార్డు ప్రజల ఫిర్యాదు చేసినా మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో తానే స్వయంగా చొరవ తీసుకొని, గుంతను ప